## రాజుల సొమ్మా?

రోడ్డుపక్కమ్మటేవున్న ధాభాముందు ఓ ప్రవేట్ బస్సు ఆగివుంది. వాళ్లంతా టీ తాగుతు వున్నారు.ఈలోపల వ్యాన్ ఆగగానె విద్యార్థులు అంతా దిగారు. ఓ అరవై ఏళ్ల పెద్దమనిషి 'టీ' ముగించుకుని విద్యార్థులకు ఎదురొస్తు చిరునవ్వు నవ్వాడు.

పెద్దమనిషి సంకలో సంచి, చేతిలో ఆనాటి దినపత్రిక, లాల్చి పైజామ, ఆకు చెప్పులు కళ్లద్దాలు ధరించాడు. విద్యార్థులు చేతులాడిస్తూ నవ్వుముఖాలతో కుర్చీలవైపు నడిచారు.

" విహారయాత్ర, విజ్ఞానయాత్ర" అడిగాడు పెద్ద మనిషి ఎదురొస్తున్న సత్యాన్ని.

" రెండూను" అన్నాడు సత్యం, మరింత దగ్గరై ఎదురెదురునిలుచోని ఒకరిచేతిలో మరొకరిచేయి వుంచుకుంటు.

" నా పేరు సత్యం, వాళ్ల టీచర్ను".

"తెలుస్తూనే వుంది, నేనూ రిటైర్ టీచర్ను నాపేరు 'సాగర్'.

" కవిసాగర్ గారైతెకాదు గదా।". అంటు మరో చేతిని నెత్తికి ఆనించుకున్నాడు ఎదోగుర్తుకు తెచ్చుకుంటు. అవును అన్నట్టు నవ్వుతు చేయిని ఆప్యాయతగ నొక్కాడు.

" మిమ్ముల్ను కలుసుకోవడం చాల సంతోషంసార్" సత్యం ఆనందంగా అన్నాడు.

"బస్సుకదులుతూవుంది వస్త". ఒకరున్న స్థలంలోకి యింకొకరు మారుతు అన్నాడు.

" బస్సును పోనీయండి, మీరు హైద్రాబాదేగ వెళ్లేది. ఏదేని బ్యాగ్వుంటె తీసుకొండి. వ్యాన్లో మాట్లాడుకుంటు వెళ్లి, హైద్రాబాదులో మిమ్ముల్ను దిగబెట్టి మేం నల్లగొండ వెడతాం" అంటూ బస్సు వైపు నడిచి బ్యాగ్ను అందుకుని వ్యాన్లో పెట్టాడు.

సాగర్ బస్సువాళ్లకు విషయం చెప్పివొచ్చాడు.

టీలు తాగడం ముగిసిన తరువాత సత్యం, "వీరు సాగర్ గారు. ప్రముఖకవి. వీరి గూర్చి మీరు, పత్రికల్లో చూసివుంటారు. రేడియోలో విని వుంటారు. వీరి రచనలకు ఎన్నో అవార్డ్స్ వచ్చాయి. అంతేకాదు మీరు ఎనిమిదవ తరగతి తెలుగు వాచకంలో వున్న వీరి కవితను చదవచ్చు"

సాగర్‌గారిని విద్యార్థులకు పరిచయం చేశాడు. అందరు నమస్కారాలతో స్వాగతం చెప్పి వ్యానువైపు నడిచి, అందుకూర్చున్నారు. వ్యాను కదిలింది. విద్యార్థులు తాము చదివిన పాఠాన్ని గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

"మీకు పాఠాన్ని రాసిన కవిగారు మీముందున్నారు. మాట్లాడండి" అన్నాడు సత్యం.

"కవిత మీకు సులభంగా అర్థం అయ్యిందా" అని అడిగాడు కవి.

అయ్యింది అన్నట్టు తలలాడించారు.

" పరీక్షలో ఓ ప్రశ్నకూడ వచ్చింది సార్, జవాబు కూడ బాగానేరాసాను' ' శర్మ అన్నాడు.

" పాఠం అర్థమైతె ప్రశ్నకు జవాబు రాయడం కష్టమేమికాదు" సత్యం చెప్పాడు."చెప్పేటీచర్ ను బట్టి గూడ వుంటుంది లెండి" కవి అన్నాడు

" చెప్పండి సార్, ఏ ఏ ప్రదేశాలు తిరిగివస్తున్నారు" అడిగాడు సత్యం. పిల్లలు కవిగారి వైపే చూస్తువున్నారు.

" ఆగ్రా, ఢిల్లీ, రాజస్థాన్, జోద్‌పూర్, ఉదయపూర్ ఇంకా మార్గమధ్యన చిన్నచిన్న పట్టణాలు, పల్లెలు" భుజానికున్న సంచిని పక్కన పెడుతు అన్నాడు సాగర్.

"కేంద్ర సాహిత్య అకాడమి గ్రాంటు మంజూరిచేసి, ఆయా ప్రాంతాలు తిరిగి, అక్కడి ప్రజల జీవన విధానాలను వేష భాషలను, కట్టు - బొట్టును, సాహిత్య సంస్కృతిని పరిశీలించి రావాల్సిందిగా కోరింది. అందుకని ఈ ప్రయాణం".

" యింకా మీ యాత్ర విశేషాలు ?" అన్నాడు సత్యం.

" ఫతేపూర్ సిక్రి, ఆగ్రా అంత కోటలు, గోరీలు. వాటిని చూస్తుంటే మన పెద్దలు అనె మాట ఓటి గుర్తొచ్చింది." అని ఆగాడు.

ఏం మాట అన్నట్టు చూశారు అందరు.

" రాజుల సొమ్ము - రాళ్ల పాలు అని" అన్నాడు. విదార్థులు ఆసక్తిగ వింటున్నారు.

"ఇకపోతె ఆగ్రా సంగతి మీకు తెలుసుకదా?"

" ఏదో కొంచం చదివినం కాని చూడలేదు కదా సార్" అన్నాడు రహీం.

" రారాజు ప్రణయ చిహ్నం పాలరాతి కట్టడం. పాలకుని భ్రమకు ప్రజల శ్రమ అర్పితం" కవిగారు కవిత చెప్పినట్టు, చెప్పాడు.

" ఆ తరువాత ఢిల్లినగరం మన రాజధాని పార్లమెంట్ ఇంకా చెప్పుకోనతగ్గ విషయం అక్కడ వందలకొలది ఎకరాల భూమి స్మశానాలకే వొదిలారు" కాసేపాగి.

" అందర్కి అరడుగులైతే వాళ్లకు ఎకరాలకొద్ది" అన్నాడు తానె.

" జాతీయ నాయకులు కదా అన్నాడు " సత్యం.

" బిర్లామందిర్, తీన్‌మూర్తి భవన్‌లు చాలవా?"

" ఏదో అభిమానంతో"

" దేనికైనా హద్దులుండాలి. దురాభిమానం కూడదు. వాళ్లు యిట్లా తమ సమాధులను తీర్చిదిద్దమని చెప్పారా?" అంటూ అందరివైపు చూశాడు ఓ సారి.

" ఇక రాజస్తాన్ అంతటా ఎక్కువగా కోటలు దేవాలయాలె! ఆ ప్రదేశాలను వెనకట రాజులు పాలించారు. కనుక పెద్ద పెద్ద రాజమందిరాలు కట్టారు. అసలె మొదటి నుండి పేదదేశం, దానికి తోడు భక్తి, భయం. భయం పోవడానికి భక్తి, భక్తిని కొలవడానికి ఆలయాలు" అంటూ పిల్లలవైపు చూశాడు. వాళ్లు శ్రద్ధగా వింటున్నారు. అవి ఒకటి రెండు కాదు, శిల్పకళలతో నింపేశారు. ఎంతమంది శ్రామికులో ఎన్నేండ్లు పనిచేశారో!

" పూజా స్థలాలు సాదాసీదాగా వుంటె చాలదా? చిత్రాలు, శిల్పాలు, ఆర్చ్‌లు, అలంకారాలు యివన్నీ అవనరం లేదు. ధ్యానమందిరాలుగవుంటె సరిపోదా?" అన్నాడు సత్యం.

" అసలు ఆలయకుడ్యాలకుండె బూతు బొమ్మలను చూస్తే ఆ ప్రాంగణంలో జరిపే పూజల్లో మనస్సుఎట్లా లగ్నమైతుందో ఆర్థంకాదు. " అన్నాడు కవి.

"అవసరం లేని ఆర్భాటాలు అవన్నీ" సత్యం అన్నాడు.

" గతంలో ఈ రాజులందరు తాము గడించిన సొమ్మునంతా యిట్లా అవసరానికి మించిన కట్టడాలకంటె, చెరువులు, కుంటలు తవ్వించి నీటి వనరుల పెంచితె యిప్పటిదాక వెన్నంటి వొస్తున్న కరువు వుండక పోయేదేమో" అన్నాడు కవి.

మళ్లితానె " అదే సంస్కృతి మరోరూపంలో కొనసాగుతూనేవుంది. ఇప్పటి పాలకులు కూడా లక్షలు వెచ్చించి పార్టీలవారిగ, ప్రాంతాల వారిగ తమతమ నాయకుల నిలువెత్తు విగ్రహాలను ప్రతిష్టిస్తునే వున్నారు." అన్నాడు.

అందరు ఆలోచనల్లోకి వెళ్లారు.